

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**ఇప్పటికీ** భారతీయ వైవాహిక వ్యవస్థ నన్ను దిగ్భ్రాంతుడిని చేస్తుంది. ఆనందపరుస్తుంది. విదేశాలలో నెలల తరబడి స్నేహమో, సెక్సో, రెండూనో దగ్గర పరిచాక ఒక్కొక్కప్పుడు యిద్దరూ కలిసి జీవించాక కూడా వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకోని సందర్భాలుంటాయి. పెళ్ళి అన్నది కలిసి బతకడానికి అవసరం కాదు. మహానటుడు స్పెన్సర్ ట్రేసీ, మహానటి కేథరిన్ హెప్‌బర్న్ దాదాపు 40 సంవత్సరాల పైగా పెళ్ళి ప్రసక్తి లేకుండానే కలిసి బతికారు. అలాంటిది ఓ సాయంకాలం ఓ అమ్మాయిని మొదటిసారి చూసి పదిమంది సమక్షంలో ఆమె మెడలో తాళికట్టిన కారణానికి – ముక్కూ మొహం తెలీని ఒక వ్యక్తితో మరో కొత్త ప్రపంచంలోకి ధైర్యంగా, నమ్మకంగా, శాశ్వతంగా నడిచి రావడం ఎంత సాహసం! ఎంత అపూర్వమయిన, అనూహ్యమయిన విషయం. తరతరాలు 'సంప్రదాయం' అలవాటుగా మారిపోయిన వ్యవస్థలో ఈ 'సంగమం' వింతగా కనిపించకపోవచ్చుగాని, మరే దేశంలోనూ సంప్రదాయానికీ, విశ్వాసానికీ – ఇంత నమ్మకమయిన పెద్దపీట వేసిన వివాహ వ్యవస్థ లేదని బల్లగుద్ది చెప్పగలను – ఏ కొద్ది ఛాయలో తూర్పు ఆసియా దేశాల్లో ఏ కాస్తో కనిపిస్తాయి. ఈ సమన్వయానికి రెండు కుటుంబాల పేరు ప్రతిష్టలూ, వధూవరుల జాతకాలూ బోలెడు చూడవచ్చుగాక – ఎంత చూసినా ఆ వ్యక్తి, అతని మనస్థత్వమూ, అతని వ్యక్తిత్వమూ కొత్తదీ, ఆ అమ్మాయికి తెలియనిదీను. కర్మ సిద్ధాంతానికో, దేవుడికో ఎంత ముడిపెట్టినా కొన్ని వందల సంవత్సరాలు ఈ వ్యవస్థ నిలదొక్కుకుని ఉన్నదంటే జాతి సంస్కృతికే పెద్ద తాంబూలం యిస్తాను నేను. సనాతన ధర్మానికి ఉన్న బలం అది.

నా పెళ్ళిలో బాగా గుర్తున్న ముఖ్యమయిన అంశం మూడోరోజు పురప్రముఖుల సందర్భంలో శ్రీపాద పినాకపాణిగారు చేసిన చాంబర్ మ్యూజిక్ కచ్చేరీ – కాపీ నారాయణిలో 'సరససామదాన' అనే త్యాగరాజ కీర్తన.

మా ఆవిడ పేరు శివకామ సుందరి. ఆపేరుని నేను శివానీగా చేసుకోవడం శరత్ ప్రభావమే. ఆయన పాత్రల్లో శివానీ(శేషప్రశ్న) ప్రముఖమయింది. ఈ 45 సంవత్సరాలూ ఆ పేరే స్థిరపడిపోయింది. మా పెద్దబ్బాయి తన పెద్ద కూతురుకి వాళ్ళ అమ్మ పేరు 'శివానీ'గానే పెట్టుకున్నాడు.

డిసెంబరు నెలలో శివానీ కాపురానికి వచ్చింది. అప్పట్లో టాగూరు శతజయంత్యుత్సవాలకి ఆచంట జానకీరాంగారు కన్వీనరు. ఆయన ఆదేశం మేరకి చిత్తూరులో ఒక సభ ఏర్పాటు చేశాను. దానికి నేను సమన్వయ కర్తని. మా ఆవిడ కాపురానికి వచ్చిన రోజే సభ. పూలదండలు పట్టుకుని ఇంటికి వచ్చాను. చిన్నతనం నుంచీ పువ్వులంటే పొంగిపోయేదట మా ఆవిడ. వొళ్ళు తెలిసేది కాదు. వచ్చిన రోజునుంచీ వందల, వేల పూలదండల కథ ఆమె జీవితం.

చిత్తూరు రాగానే శంకరంబాడి సుందరాచారిగారు ఇంటికి వచ్చారు. ఆయనకి కొత్తబట్టలు పెట్టి ఇద్దరం పాదాభివందనం చేశాం. కవి ఇవ్వగలిగింది ఏముంది? అక్కడికక్కడే కూర్చుని రాసి ఓ పద్యం, ఒక హితువు ఇచ్చారు.

సకల సౌభాగ్య సంపత్తి, సరస మైత్రి

ఆయురారోగ్య ఘనకీర్తి, ఆత్మ తృప్తి

యోగ ఫల శక్తి, భుక్తి, సుఖ సుప్తి కలిగి

మారుతీ శివకాములు మనగ వలయు.

ఆయన వాక్శుద్ధిగల హితులు. ఆయన ఆశీర్వాదంలో చెప్పినవన్నీ అక్షరాలా జరిగాయి. హితవు ఇది "నువ్వింకా సంసార సాగరం బీచిలోనే ఉన్నావు. మంచిగాలీ, వెలుగూ అంతా ఉంది. వచ్చే యేటికి మీ ఇద్దరూ ముగ్గురవుతారు. అప్పుడు సాగరంలో దిగాలి. అక్కడే తిమింగలాలూ, తుఫానులూ ఎదుర్కోవాలి. డబ్బు చేరవెయ్యి."

పెళ్ళయ్యాక మరో ఇద్దరు పెద్దలు ఇంటికి వచ్చారు. ఆచంట జానకీరాం గారు. I hope you didi'nt break anybody's heart అన్నారు. మరొకాయన ఫన్ డాక్టరు, ప్రముఖ మోనో ఏక్టరు చంద్రశేఖరంగారు. చంద్రశేఖరంగారు మా ఇంట్లో భోజనం చేసి దీవించి వెళ్ళారు.

పెళ్ళయ్యాక హానీమూన్‌లు లేవు. ఆ రోజుల్లో అలాంటి అలవాట్లే లేవు కనుక. నా వ్యాసంగంలో ఎలాంటి మార్పూ రాలేదు. పెళ్ళి, భార్యా చాలామంది జీవితాల్ని ప్రభావితం చేస్తుంది. కాని నా వ్యాసంగమే ఆవిడ మీద ప్రభావం చూపేటట్టు ప్రవర్తించాను. గొప్ప విషయం ఏమిటంటే ఆమె అతి హుందాగా, మౌనంగా transparent నన్నలా ప్రవర్తించనిచ్చింది. నిలదీయడం మగాడి అహంకారం కావచ్చు. నిలదీయబడడం ఆడదాని విజయం అంటాను. కాపురానికి వచ్చిన తొలిరోజుల నుంచీ నేను నాటకానికి రిహార్సల్స్‌కి వెళ్తే – మా ఆవిడా నాతో వచ్చేది. ఏ రాత్రికో రిహార్సల్స్ అయే వరకూ మా మిత్రులు మోహన్‌దాసు గారింట్లో కూర్చునేది. రాత్రి యింటికి చేరాక వండి వడ్డించేది.

హనుమకొండ లైబ్రరీలో "కన్యాశుల్కం" మీద ఉపన్యాసాల్ని ఏర్పాటు చేశారు – మిత్రమండలివారు హనుమకొండ టౌన్‌హాలులో. ఆ సభలో మా మామగారు, కాళోజీ నారాయణరావుగారు ఉన్నారు.

అప్పుడు, ఆ తర్వాతా కన్యాశుల్కం గురించి నేను చెప్పిన విషయాన్ని చాలామంది చాలాసార్లు తప్పుగా అర్ధం చేసుకుని విమర్శలు చేశారు. అందులో ముఖ్యంగా పురాణం. ఎమ్వీయల్ తన కాలంలో ఎక్కడో నా మీద ఓ విసురు విసిరిన గుర్తు. కన్యాశుల్కం గురించి నేనూ, గుంటూరు శేషేంద్రశర్మగారూ ఆ విషయమై సమగ్రంగా "విశ్వసాహిత్యంలో కన్యాశుల్కం స్థానం" అని అప్పటికి అయిదారేళ్ళ ముందుగానే ఆంధ్రప్రభలో వ్యాసం రాశాం. దురదృష్టవశాత్తూ ఆ వ్యాసం నా దగ్గర లేదు.

కన్యాశుల్కం అద్భుతమయిన సృష్టి. సందేహమే లేదు. అయితే రెండు కారణాలకి దాని అప్పీలు పరిమితమయిపోయింది. ఒకటి: ప్రాంతీయమయిన భాష. విశాఖపట్నం ప్రాంతంలో వెలనాటి బ్రాహ్మణుడి భాషకీ, నియోగి బ్రాహ్మణుడి భాషకీ, చదువుకొన్ని ఇంటలెక్చ్యువల్ మాట్లాడే భాషకీ ఉన్న అతి సున్నితమైన వైవిధ్యాన్ని చూసిన కళాస్రష్ట గురజాడ. ఇది నభూతో నభవిష్యతి. రెండవది: సమస్య – కన్యాశుల్కం. ఆ సమస్య కాలగర్భంలో కలిసిపోయి చాలా సంవత్సరాలయింది. It is a great representativ play. అది కాల పరిణామంలో ఒక సమస్యకు అద్దం పట్టే అపూర్వమయిన కళాఖండం. కాని శాశ్వత విలువల్ని ప్రతిపాదించేది కాదు. ఇలా అన్నప్పుడు దాని విలువని కురుచ చేయడం ఉద్దేశం కాదు. Universality of a piece oa art need not be a pre – condition to judge its genius. ఆ సమస్యకి limitations కొన్ని ఉన్నాయని చెప్పడమే ఉద్దేశం. కన్యాశుల్కం మార్గదర్శికాదు. ఒక మైలు రాయి. ఇదీ నా ప్రసంగ సారాంశం. ఇదే నేనూ, గుంటూరు వారూ రాసిన వ్యాస సారాంశం కూడా.

నా ప్రసంగానికి చాలామంది తలలు పట్టుకున్నారని మా మామగారు తర్వాత నాతో చెప్పారు. తెలుగుదేశంలో కనీసం కొందరయినా "మారుతిరావు కన్యాశుల్కం గొప్ప నాటకమే కాదు అన్నాడు" అని రాశారు. ఇది ఫైన్ ప్రింట్ ని అర్ధం చేసుకోని, చేసుకోడానికి ప్రయత్నించని ఫలితం. అయితే గురజాడ మనస్సులోనయినా లేని, ఆ కాలపు ఊహకయినా రాని తర్వాత కాలపు రాజకీయ పార్టీ సిద్ధాంతాలకు ఆ రచయితని ముడిపెట్టిన అభ్యుదయ వాదులకు ఈ మీమాంస అస్సలు కొరుకుడు పడదు.

ఏ వ్యక్తికయినా, నాటకానికయినా కొందరు అభిమానులుంటారు. కొందరు 'భక్తు'లుంటారు. (ఈ దేశంలో శ్రీశ్రీ భక్తులు కోకొల్లలు) ఎవరు ఏం రాసినా, చెప్పినా శ్రీశ్రీని ఉదహరించడం ఓ ఫాషన్. శ్రీశ్రీని ఉటంకించడం గొప్పతనానికి చాకలి గుర్తు. శ్రీశ్రీ గురించి బొత్తిగా అవగాహన లేని వారు కూడా ఆయన్ని ఎన్నో సందర్భాలలో ఉదహరించడం నాకు తెలుసు. శ్రీ శ్రీ గొప్పతనాన్ని యిక్కడ చర్చించడంలేదు. ఒక వ్యక్తికో, ధోరణికో 'భక్తు'లయితే నెత్తిన వేసుకుని ఊరేగడం

తప్పు చెయ్యగలిగింది ఏమీలేదు. అభిమానాన్ని అవగాహన స్థాయిలో నిపితే విచక్షణకీ, విమర్శకీ – కాస్తపాటి మీ మాంసకీ చోటుంది. The biggest calamity could be 'reason'. షేక్స్‌ఫియర్ మీద ప్రపంచ భాషల్లో వచ్చినన్ని డాక్టరేట్లు మరెవరి మీదా రాలేదు. ఆస్కార్‌వైల్డ్ మాట యిక్కడ గుర్తు చేసుకుంటే సరిపోతుంది. Diversity of opinion about a work of art shows that the work is new complex and vital. నిజానికి ఈ ప్రసంగం తర్వాత 40 ఏళ్ళకి – అంటే నా 62వ యేట – 26 యేళ్ళ గిరీశం పాత్రని నటిస్తూ గురజాడ రాసిన నాటకాన్ని యధాతథంగా రావికొండలరావుగారి దర్శకత్వంలో టెలివిజన్ నాటకాన్ని చేశాం. నూట పదకొండు సంవత్సరాల క్రితం ఓ మహానుభావుడు రాసిన నాటకాన్ని కామాలూ, వొత్తులూ మార్చకుండా యధాతథగా నటించాను. ఒక దీర్ఘమయిన సంభాషణలో ఊపిరి తీసుకోడానికి ఎక్కడ 'విరుపు' ఉండాలో 111 సంవత్సరాల క్రితమే నిర్దేశించిన ఆ కళాస్రష్టకి మనస్సులోనే జోహారులర్పిస్తూ పులకించి పోయాను. నా నటజీవితంలో కన్యాశుల్కంలో గిరీశం పాత్ర ధరించడం ఓ గొప్ప అవకాశం, అదృష్టం. నా నటజీవితానికి కలికితురాయి – గిరీశం.

సభ అయాక కాళోజీని కలిశాను. "మిమ్మల్ని పరోక్షంగా తెలిసినా యిదే మొదటిసారి కలవడం" అన్నాను.

"మనం మీ యింట్లోనే కలిశాం (మీ పెళ్ళికి). మీ మామగారు మా గురువుగారు" అంటూ పాత సందర్భాన్ని గుర్తుచేశారు కాళోజీ.

ఓసారి విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్నాను. రాజమండ్రి స్టేషన్లో కాళోజీ కనిపించారు – ఫలహారం చేస్తూ. పలకరించారు. ఈలోగా టీసీ వచ్చి "మీ సీటు తీసుకున్నారా? త్వరగా కూర్చోండి. లేకపోతే ఎవరైనా కూర్చుంటారు" అన్నాడు.

నేను నవ్వి కాళోజీని చూపిస్తూ "వీరు చెప్పిన మాటే ఒకటి ఉంది. తొలగి త్రోవెవడిచ్చు – త్రోసుకుని పోవలయు. పదవ ఆరాటము – బ్రతుకు పోరాటము" అని చెప్పాను. కాళోజీ ముఖంలో తప్పిపోయిన బిడ్డ కనిపించినప్పుడున్న ఆనందం – గేయమంతా చదివాను.

దాదాపు 30 సంవత్సరాల తర్వాత నన్ను హనుమకొండలో అదాలత్ (కోర్టులు) సిబ్బంది ఉత్సవాలకి ముఖ్య అతిథిగా పిలిచారు. రోడ్డుకి అటుపక్క మా మామగారిల్లు. పెళ్ళయిన ఈ 30 ఏళ్ళలో ఏనాడూ రోడ్డు దాటి ఇటు రాలేదు. అప్పటికి కాళోజీ 80 పడిలో ఉన్నారు. పద్మభూషణ్ అయ్యారు. ఆడియన్స్‌లో ఆఖరి వరసలో ఉన్నారు. ఈ రాజమండ్రి సందర్భం గుర్తుచేసి ఆ నాలుగు వాక్యాలూ చదివాను. కాళోజీ ఆడియన్స్‌లోంచే 'సలాం' చేశారు.

పీవీ, కాళోజీ ఆప్తమిత్రులు. ఇద్దరివీ వేర్వేరు మార్గాలు. అయినా పీవీగారు ప్రధానిగా ఉన్నప్పుడు కాళోజీని పద్మభూషణ్ చేశారు. చేసినందుకు పీవిగారూ గర్వపడడాన్ని నాతో స్వయంగా చెప్పారు. ఆదర్శాలలో విభేదం ఉన్నా, మిత్రత్వంలో అభేదం ఉన్న వ్యక్తులిద్దరూ. నాకు వారిని తలుచుకున్నప్పుడల్లా అనూయిల్ "బెకెట్" జ్ఞాపకం వస్తుంది. (పోలిక వైరాన్ని గురించి కాదు. వేర్వేరు సిద్ధాంతాలకు కట్టుబడినా ఇద్దరికీ ఉన్న మిత్రత్వాన్ని గురించి.)

ఆ రోజుల్లో ముమ్మరంగా సాగిన ఉత్తర ప్రత్యుత్తరాల మిత్రులు – గణేష్ పాత్రో, రాఘవ, శ్రీపతి, బి.యస్.రెడ్డిగారు, పురిపండా, చెలం, జువ్వాది రామారావు, జ్యేష్ఠ అనే బసవరాజుగారితో, శ్రీపతి, జ్యేష్ఠ కమ్యూనిజంలోకి తలమునకలుగా చొచ్చుకుని బయటపడి దేవుడు, వేదాంతం వేపు మళ్ళినవారు. కమ్యూనిజం కాకపోయినా దాదాపు నాస్తికత్వం నుంచి ఈశ్వరుని వేపు ప్రయాణం చేసిన వారు చలంగారు. ఈ ఉత్తరాలన్నీ గుట్టలు గుట్టలుగా నా దగ్గర చాలాకాలం ఉండేవి. 1962 జనవరి డైరీలో ఒక్క వాక్యం కనిపించింది. "మీలాగా వ్రాయాలని ప్రయత్నిస్తున్నాను. మీ దగ్గర ఏదో Wild inspiration ఉంది" అన్న జ్యేష్ఠగారి ఉత్తరం. చాలాసార్లు విశాఖ వచ్చినప్పుడల్లా కలిసేవాళ్ళం. గణేష్ పాత్రో, కె. వివేకానందమూర్తి నన్ను వదిలిపెట్టేవాళ్ళు కాదు. నా శైలికి పెద్ద అభిమానులు, నా శిష్యులు వివేకం, పాత్రో. ఆ మాట నిగర్వంగా అన్నిచోట్లా చెప్పినవాడు పాత్రో. మనస్సులోనే ఉంచుకున్నవాడు వివేకం.

మరొక మరపురాని స్నేహం – నాకంటే కనీసం 30 సంవత్సరాలు పెద్ద అయిన డాక్టర్ ఈశ్వర మార్తండ శాస్త్రిగారితో. వివేకానందమూర్తే నన్ను ఆయనకి పరిచయం చేశాడు. ఆయన ఆంధ్రాయూనివర్సిటీ మెడికల్ ఆఫీసర్. చండశాసనుడు. క్రమశిక్షణతో విద్యార్ధులని హడలగొట్టేసేవారు. గొంతులో అధికారం, స్పష్టమయిన ఆలోచనా తెలిసేది. నిరంకుశత్వం ఆయన వ్యక్తిత్వంలో ముఖ్య లక్షణం. కాని ఆ కరుకుదనాన్ని తట్టుకుని, ఆయన హృదయాన్ని స్పృశించగలిగితే అమృత హృదయులు. గొప్ప స్నేహపాత్రుడు. ఆయన కాంపౌండరు ఉద్యోగంకోసం ఇంటర్వ్యూ చేసిన తీరు వినతగ్గది. ఆ ఉద్యోగానికి ఇద్దరు వచ్చారట. చదువు, అనుభవం గురించి ఎక్కువ పట్టించుకోలేదు శాస్త్రిగారు. ఒకాయన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం జె.వి.డి. సైన్స్ కాలేజీ దగ్గర విక్రమదేవవర్మ విగ్రహం దగ్గర నిలబడమన్నారు. మరొకాయన్ని అవుట్ గేట్ దగ్గర ఉన్న తన యింటి దగ్గర నిలబడమన్నారు. తన పనులు ముగించుకుని – మధ్యాహ్నం మండుడెండలో విక్రమదేవ వర్మ విగ్రహమ్ దగ్గర ఆగారు. పక్కనే ఉన్న బిల్డింగు అరుగు మీద నీడలో కూర్చు వ్యక్తి దిగి వచ్చి నమస్కారం చేశాడు. శాస్త్రిగారు ఇంటికి వచ్చారు . మండుటెండలో రెండో వ్యక్తి నిలబడి ఉన్నాడు. శాస్త్రిగారి పరీక్ష తేలిపోయింది. మొదటి వ్యక్తి కర్తవ్యంలో సుఖాన్ని వెదుక్కున్నాడు. రెండో వ్యక్తి ఖండితంగా కర్తవ్యాన్నే నిర్వహించాడు. రెండో వ్యక్తికి ఉద్యోగం యిచ్చారు. ఆ కాంపౌండరు ఆయనతో ముప్ఫై ఏళ్ళు పైగా పనిచేశాడు. మొదటి పరిచయంలోనే మేం ఇద్దరం ఇనుమూ, అయిస్కాంతంలాగ అతుక్కుపోయాం. ఆయన తన ఫోటోని నాకిస్తూ దానిమీద రాసిన వాక్యం

మా స్నేహాన్ని చక్కగా వివరిస్తుంది. "To dear Maruthi Rao with whom, in spite of age, I see eye to eye , mind to mind."

నాకంటె పెద్ద వాళ్ళతో సాహచర్యం నేను నా వ్యక్తిత్వానికి ఏర్పరచుకున్న బంగారు నగిషీ.

కాపురానికి వచ్చిన మొదటి సంక్రాంతి పండుగకి అత్తారింటికి వెళ్ళని అల్లుడిని నేను. మా యింటికి ఎదురుగా రావూరు సత్యనారాయణరావుగారుండేవారు సకుటుంబంగా.

"పండుగకి ఏమిటి కొన్నారు మీ ఆవిడకి?" అని అడిగారు.

ఏమీలేదన్నాను. అప్పటికప్పుడు తనతో బజారుకి తీసుకువెళ్ళారు. చీర, జాకెట్టు, పువ్వులూ కొనిపించారు. మా ఆవిడ ఆనందానికి అవధుల్లేవు.

ఆ రోజుల్లోనే అష్టగ్రహ కూటమి దగ్గర పడుతోంది. ఆనాటికి ప్రళయం ముంచుకొస్తుందని చాలామంది నమ్మారు. ముఖ్యంగా చెలంగారు. అందరికి ఉత్తరాలు రాశారు. మా అమ్మగారికి – విశాఖ అడ్రసుకి ఉత్తరం వెళ్ళింది. ఆ కూటమికి జలమయమయ్యే ప్రదేశాలలో మద్రాసు ఒకటని తేల్చారు. ప్రళయం నుంచి బయటపడటానికి జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారు, యామిజాల పద్మనాభస్వామిగారు చిత్తూరు వచ్చారు. ఆంధ్రప్రభ ఆఫీసుకి మా యిల్లు దగ్గర. నేనూ, రావూరు, కృష్ణగారూ నడుస్తూంటే దారిలో నా సైకిలు తీసుకుని మా ముందు తొక్కుతూ జలసూత్రం సాగడం అతి చక్కని జ్ఞాపకం. ప్రతీరోజూ శాస్త్రిగారితో సాహితీగోష్ఠి, సరసమయిన కబుర్లూ సాగేవి.

మా యింట్లో గొంతికిలా కూర్చుని "నువ్వు మాకు దూరం. మీ ఆవిడ మా అమ్మవారు. మా అమ్మా! తల్లీ! పామరుణ్ణి, పరమ బీదవాణ్ణి ఈ దీనుడికి ఓ కప్పు కాఫీ యియ్యమ్మా" అనేవారు. ఆనందంగా కలిపి తెచ్చేది మా ఆవిడ.

మా ఆవిడ కాఫీకి ఘనమయిన చరిత్ర ఉంది. సాహితీపరులూ, అభిమానులూ, తర్వాత సినీరంగంలో నాతో పనిచేసిన అసిస్టెంటు డైరెక్టర్లూ, డైరెక్టర్లూ – పనిగా వచ్చి మా ఆవిడ చేతి కాఫీ తాగి వెళ్ళడం రివాజు. విశాఖపట్నం వచ్చినప్పుడల్లా మా అమ్మ నవ్వుతూ "నీకు కాఫీ యివ్వాలంటే భయమేస్తుంది సుందరీ" అనేదట. విశ్వనాథవారు వానలో తడియని వారూ, తమ గురువుల కవితాధారలో తనియని వారూ లేరని చెప్పుకున్నారు. ఆ మాట నేను మా ఆవిడ కాఫీకి చెప్పుకుంటాను. బి.వి. ప్రసాద్, భాస్కరరావు, ముత్యాల సుబ్బయ్య, కోడి రామకృష్ణ – యీ జాబితా యిలా పెరుగుతూ పోతుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments